

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
# వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 29588 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 74.420 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 250, ఎన్ఎఫ్‌సికి 400, పెన్నా డెల్టాకు1000, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 100.092 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## ప్రతిష్టాత్మకంగా కలెక్టర్ల కాన్ఫరెన్సు నిర్వహణ

- మొదటిరోజు కలెక్టర్స్ కాన్ఫరెన్స్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, హిమాన్షు శుక్లా



**నెల్లూరు కలక్టరేట్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కలెక్టర్ల కాన్ఫరెన్సును జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది వీక్షించారు. సోమవారం ఉదయం అమరావతిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 4వ కలెక్టర్ల కాన్ఫరెన్సు



నిర్వహించారు. రెండురోజుల పాటు జరగనున్న ఈ కాన్ఫరెన్సులో మొదటిరోజు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టాల్సిన విధివిధానాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, వివిధశాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మార్గదర్శనంలో రాష్ట్రప్రగతికి కాన్ఫరెన్సులో చర్చించిన పలు అంశాలను కింది స్థాయి అధికారులకు నేరుగా తెలిసేలా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించారు.

## పిజిఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ కె కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు డిఆర్‌వో విజయకుమార్, జడ్పీ సిఇవో మోహన్‌రావు, డ్వామా పీడీ గంగాభవాని, డిపివో శ్రీధర్‌రెడ్డి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులోని గురుకుల పాఠశాలను సందర్శించనున్న మంత్రి 'ఆనం'



**ఆత్మకూరు, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** ఆత్మకూరులోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సందర్శిస్తారని ఆనం కార్యాలయ సిబ్బంది తెలిపారు. 13న స్థానిక గురుకుల పాఠశాలలో విషజ్వరాలు ప్రబలిన విషయమై జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన మంత్రి ఆనం మంగళవారం ఉదయం 9గంటలకు స్వయంగా గురుకుల పాఠశాలను పరిశీలించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటారని, బిసి బాలికల గురుకుల పాఠశాలల ను కూడా మంత్రి ఆనం సందర్శిస్తారన్నారు. అనంతరం ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో అన్ని విభాగాల వైద్యులతో మంత్రి సమావేశమవుతారని వారు తెలిపారు.

## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కృషి ఫలితంగానే బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ గ్రేడ్ -2 హోదా



**బుచ్చి సెప్టెంబర్ 15 ప్రభాతవార్త** కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కృషి ఫలితంగానే బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీకి గ్రేడ్-2 హోదా మున్సిఫాల్టీగా కావడం హర్షనీయమని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ పేర్కొన్నారు.ఈ సందర్బంగా ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, మున్సిఫల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణకి , ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ప్రత్యేకంగా దన్యవాదాలు తెలియజేశారు . బుచ్చిరెడ్డిపాళెం మున్సిఫాల్టీ కావడంతో మరెన్నో నిధులు వచ్చే అవకాశం లభిచిందని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ తొలి చైర్‌పర్సన్ కావడం నా అదృష్టం అలాగే బుచ్చినగరపాలక పంచాయితీ అప్‌గ్రేడ్ అయి మున్సిఫాల్టీ కావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మరింత అభివృద్ధి చెందుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు .

## ఎన్టీఆర్ సుజల పథకాన్ని సద్వినియోగం చేసుకోండి
## కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** నెల్లూరు నగర పాలక సంస్థ ఎ ్ రి ది . ల ో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సుజల సురక్షిత తాగునీటి పథకాన్ని ప్రజలం దరూ స ద్వి ని యో గం చేసుకోవా లని కమిషనర్ వై.ఓ నందన్ సూచించా రు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ వై.ఓ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను అందుకున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానిక వెంకటేశ్వరపురం వేప దరువు పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణాల ఏర్పాటు చేసి ఉన్న ఎన్టీఆర్ సుజల సురక్షిత త్రాగునీటి వాటర్ ప్లాంట్ల నుంచి సేకరించి నగరవ్యాప్తంగా 15 రిమోట్ డిస్పెన్సరీ కేంద్రాల ద్వారా ప్రతిరోజు సుమారు మూడు లక్షల లీటర్ల సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.తాగునీటి కేంద్రాలలో వివరాలను నమోదు చేసుకున్న మొదట 100 మంది లబ్ధిదారులకు 50 రూపాయల రిజిస్ట్రేషన్, 20 రూపాయల రీఛార్జ్ ఉచితంగా అందజేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా కేవలం రెండు రూపాయలకే 20 లీటర్ల సురక్షిత తాగునీటిని పొందే అవకాశాన్ని పౌరులందరూ సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఆకాంక్షించారు. నగరవ్యాప్తంగా అనధికార నిర్మాణాలు, పట్టణ ప్రణాళిక విభాగం నిర్దేశించిన ప్లాన్ ను అతిక్రమించి కట్టడాలను చేపట్టవద్దని, నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలను తప్పనిసరిగా తొలగించి చేస్తామని కమిషనర్ తెలియజేశారు.పట్టణ ప్రణాళిక విభాగంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సరళీకృత మార్గదర్శకాలను రూపొందించి అనుమతుల మంజూరు ప్రక్రియను సులభతరం చేసిందని, భవన యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్మాణాలు జరుపుకోవాలని కమిషనర్ సూచించారు.విభాగాల వారీగా అకౌంట్స్-3, ఇంజనీరింగ్-4, రెవెన్యూ-6, పబ్లిక్ హెల్త్-4, హౌసింగ్-14, టౌన్ ప్లానింగ్-14, మొత్తం 45 విజ్ఞప్తులను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి, సిటీ ప్లానర్ హిమబిందు, సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

- సైబర్ క్రైమ్స్ పై అవగాహన కార్యక్రమాలు - జిల్లా నూతన ఎస్పీ అజిత వేజెండ్ల



**నెల్లూరు క్రైమ్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తానని జిల్లా నూతన ఎస్పి అజిత వేజెండ్ల స్పష్టం చేశారు. జిల్లా నూతన ఎస్పీగా సోమవారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీ ఎలిమెంట్స్ లేకుండా, మహిళల భద్రత సున్నిత అంశాలు పై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలతో ప్రణాళిక బద్ధమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈగల్ టీం సహాయంతో డ్రగ్స్ రహిత జిల్లాగా మారుస్తామని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు అరికట్టేందుకు సిబ్బందితో కలిసి ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. ముఖ్యంగా పోలీసు శాఖలో సిబ్బందికి వెల్ఫేర్ ఉండేలా చూసుకుంటానని హామీనిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, నిత్యం ఎప్పుడైనా సమస్యలపై ప్రజలు తనకు కాల్ చేయవచ్చని, ప్రజలకు సమాజంలో పోలీసింగ్ పై గౌరవం పెరిగేలావిధులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీగా తనకు బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి, డిజిపి హరీష్ కుమార్ గుప్తాలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

## విచారణ జరిపి న్యాయం చేస్తాం..

- జిల్లా యస్.పి. డా.అజిత వేజెండ్ల



**నెల్లూరు క్రైమ్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం సోమవారం ఉమేష్ చంద్ర సమావేశం మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నూతన ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో జిల్లా యస్.పి. స్వయంగా మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 90 ఫిర్యాదులు అందాయి. అల్లూరు పరిధికి చెందిన వ్యక్తిని, హైదరాబాద్‌కు చెందిన మాడిశెట్టి నిఖిల్ అనే వ్యక్తి డ్రగ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ. 34.88 లక్షలు నగదు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని, అదే విధంగా కోవూరు పరిధికి చెందిన వ్యక్తిని ప్రొద్దుటూరుకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి అనే వ్యక్తి సాఫ్ట్వేర్ జాబ్ ఇప్పిస్తాననిరూ. 3.50లక్షలు నగదు తీసుకొని జాబు ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. బుచ్చి పరిధికి చెందినమహిళ తన భర్త శివకుమార్‌తో విడాకులు తీసుకున్నట్లు అయినా కూడా తాగి ఇంటికి వచ్చి వేధిస్తున్నట్లు, గతంలో తీసుకున్న ఆమె యొక్క వ్యక్తిగత ఫోటోలు సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తానని బెదిరిస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు. ఆత్మకూరు పరిధికి చెందినటువంటి వ్యక్తి కుమార్తె ఓ ప్రైవేట్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్నట్లు, గతవారం ఉద్యోగానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని, తన కుమార్తె ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా జిల్లా యస్.పి. హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్.సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, ఉమెన్ పిఎస్ డిఎస్పి రామారావు , ఎస్‌బి డిఎస్పి శ్రీనివాసరావు, ఉమెన్ పిఎస్ సిఐ సుబ్బారావు, ఎస్‌బి సిఐ 1 వెంకటేశ్వరరావు, ఎస్‌బి 2 సిఐ శ్రీనివాసరెడ్డి కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ పాస్ యంత్రాలతో ఇక ప్రజా పంపిణీ సులభతరం



**నెల్లూరు అగ్రికల్చర్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రజలకు సరఫరా చేసే రేషన్ బియ్యం చక్కెర తదితర నిత్యవసర వస్తువుల పంపిణీ త్వరితగతిన చేపటిట, ప్రజలు నిరీక్షించకుండా సరఫరా చేసేందుకు ప్రభుత్వం నూతన ఈ పాస్ యంత్రాలను ప్రవేశపెట్టింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ పాస్ మిషన్లు నాణ్యతతో కూడుకున్నవి కావడంతో ఇక నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థలో డీలర్లు, సులభమైన మార్గంలో సరుకులను అందించేందుకు ఉపయుక్తంగా ఉండనున్నాయి. నెల్లూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో కోవూరు మండలానికి పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న ఈ పాస్ యంత్రాలను నెల్లూరు ఆర్డీఓ అనూష సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరు అర్బన్ లో 69, నెల్లూరు రూరల్ మండలంలో 85 ఈ పాస్ యంత్రాలను డీలర్లకు పంపిణీ చేయడం జరిగిందని, నేడు కోవూరు మండలానికి ఈ పాస్ యంత్రాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్న ఈ యంత్రాలను ఉపయోగించి ప్రజలకు సరుకులను సకాలంలో అందించాలని డీలర్లను ఆదేశించారు.

## రిజిస్ట్రేషన్లకు ఓటిపి విధానాన్ని తొలగించాలి



**కావలి , సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఓటిపి విధానాన్ని రద్దుచేసి పాత విధానాన్ని కొనసాగించాలని కావలి పట్టణంలోని డాక్యుమెంట్ రైటర్లు, స్టాంపు వెండర్లు సోమవారం పెన్డౌన్ కార్యక్రమాన్ని చేపట్టి కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసనను చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు ఎవరైనా రిజిస్ట్రేషన్లు ఎంచుకునేవారికి కానీ చేసేవారికి కానీ ఓటిపి తప్పకుండా రావాలని ఓటీపీ వచ్చినట్లయితేనే రిజిస్ట్రేషన్లు జరుగుతాయని దీనివలన ఎంతో ఇబ్బందులు పడడం జరుగుతుందని తెలియజేశారు స్టాంపులు కొనుగోలు చేయదలుచుకునే వారికి కూడా తప్పనిసరిగా ఓటిపి వచ్చినట్లయితేనే వారికి స్టాంపులను ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు ఎక్కడో మారుమూల ప్రాంతాల నుంచి వచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం,స్టాంపులను కొనుగోలు చేయడం జరుగుతుందని వారికి ఓటిపిలు రాక ఎంతో ఇబ్బందులు పడతారని ఓటిపి రానట్లయితే వారికి రిజిస్ట్రేషన్ లో కానీ స్టాం పులను ఇవ్వడం కానీ జరగదని తెలియజేశారు ఈ ఓటిపి విధానం వలన ప్రజలు ఎంతగానో ఇబ్బందులకు గురికావడం జరుగుతుందని ఓటీపీ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు ఈ కార్యక్రమంలో కావలి పట్టణ డాక్యుమెంట్ రైటర్లు,స్టాంప్ వెండర్లు పాల్గొన్నారు

## జలదంకిలో మద్యం ఏరులైపారుతుంది...పల్లెల్లో విచ్చలవిడిగ బెల్ట్‌షాపులు

పట్టించుకోని ఎక్సైజ్ అదికారుల పోరుబాటపడుతామంటున్న ఎస్‌సి యువత



**జలదంకి, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** జలదంకి మండలంలో మద్యం మహమ్మారికి ఎస్‌సి,ఎస్‌టి యువత అతలాకుతలమౌతుంది.పల్లెల్లో విచ్చలవిడిగ బెల్ట్‌షాపులు వీధికొకటి చొప్పున వెలిసి ఏరులైపారుతుంది.ఎక్సైజ్ అదికారులు మామూళ్ళ మత్తులోజోగుతు నియంత్రణ గాలికొదిలి పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.ఇక ఉపేక్షిస్తే యువకుల జీవితాలు నాశనంకాకతప్పవని కొందరు యువకులు నడుంబిగించి దీనిని ఎండగట్టాలని నిర్ణయించుకున్నారు. మండలకేంద్రమైన జలదంకిలో సోమవారం విలేఖర్ల సమావేశం ఏర్పాటుచేసి మద్యంపై సమరశంఖం పూరించారు.ఎక్సైజ్ అదికారుల తీరును ఎండగట్టారు.విలేఖర్లముందు తమగోడు వెళ్ళబుచ్చుకున్నారు.మద్యం తీవ్రతపై ఆక్రోశించారు. ముఖ్యంగ 90రూపాయల క్వార్టర్‌బాటిల్‌ను 200రూపాయల అదికధరకు విక్రయిస్తుండడం పై ఆగ్రహంవ్యక్తంచేశారు. పేద యువత ఆరోగ్యం నిలువున నాశనమవుతుండడంపై తూర్పారబట్టారు. మండలపరిదిలోని కమ్మవారిపాళెంకు చెందిన పచ్చా పెంచల్‌నాయుడు తీరునువారు తీవ్రంగ గర్హించారు.ఆయన తన భార్య,అత్త పేరులపై షాపులను దక్కించుకొని కల్లుగీత కార్మికులు షాపునుకూడ పిడికిటపట్టుకొని తాను ఆడిందేఆటగ వ్యవహరిస్తున్నారని పలితంగ మండలంమద్యంతో సర్వనాశనమవుతుందని తీవ్ర ఆరోపణలు గుప్పిం చారు. అదేమని ప్రశ్నిస్తే ఎక్సైజ్ అదికారులకు బారిమొత్తంలో అమ్యామ్య ముట్టజెపుతున్నాను మాఇష్టం ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోమని బహిరంగంగానే కాలరెగురేస్తున్నారని అన్నారు. అంతేకాకుండ ప్రతి బెల్ట్‌షాపునుంచి 50వేల వంతున వసూలుచేసి దాదాపు 50లక్షల పైచిలుకు దండుకున్నారని ఆరోపించారు.ఒకరకంగ చెప్పాలం టే మండలంలో కూరగాయలు,మంచినీటికి కరువేమోకాని మందుమాత్రం ఏటైమ్‌లోనైన, ఎక్కడైన దొరుకుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదని వారు పెదవివిరిచారు. ఇప్పటికైన ఎక్సైజ్, అదికారులు కలుగజేసుకొని మద్యం విచ్చలవిడి పారదలకు అడ్డుకట్టవేయకపోతే తాము పోరుబాటపట్టి ఆందోళన కార్యక్రమాలకు అన్ని గ్రామాల యువతను సన్నద్ధంచేయడం ఖాయమని తేల్చిచెప్పారు. అన్నవరం, చినక్రాక, వేములపాడులకు చెందిన యువత గిరిబాబు, చంద్రయ్య, వెంకట్రావు, మాధవరావు, ప్రమోద్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదిదారులకు భరోసా కల్పించాలి

- జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల - దర్గామిట్ట స్టేషన్ తనిఖీ



**నెల్లూరు క్రైమ్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు భరోసా కల్పించేలా పోలీసుల పనితీరు ఉండాలని జిల్లా నూతన ఎస్పీ అనిత వేజెండ్ల పేర్కొన్నారు. సోమవారం దర్గామిట్ట పోలీసు స్టేషన్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గత మూడేళ్ల క్రైమ్ ఏవిధంగా ఉందో రికార్డులను పరిశీలించి, తగిన ఆదేశాలు జారీ చేసారు. ఆమె మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్‌లు, సస్పెక్ట్‌లు, పాత నేరస్తులపై నిఘా పెంచాలని, క్రిమినల్ చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హత్య, దోపిడీ, ఇతర తీవ్ర నేరాల కేసులలో ముద్దాయిలపై రౌడీ షీట్ ఓపెన్ చేయాలని, యాక్టివ్‌గా ఉన్న రౌడీ షీటర్స్‌పై పిడి యాక్ట్ నమోదు చేయాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ వ్యవస్థను ముమ్మరం చేయాలని, చైన్ స్నాచింగ్ నియంత్రణకు చర్యలు పట్టాలని మిస్సింగ్, మర్డర్, అనుమానాస్పద మరణాలు, హత్యాయత్నాల కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టంచేశారు. అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ సమర్థవంతమైన సేవల ద్వారా జిల్లా పోలీస్‌శాఖకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. సిబ్బంది యోగ క్షేమాలు అడిగి, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, డిపిటలో ఏమైనా ఫైల్స్ పెండింగ్ ఉంటే వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కార్యాచరణలు, నూతన ప్రణాళికలను అమలు చేస్తామని, ప్రతి వారం మెన్ గ్రీవెన్స్ ఉంటుందని, అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భనలో ఆమె వెంట టౌన్ డిఎస్పి సింధు ప్రియ, ఎస్‌బి డిఎస్పి శ్రీనివాసరావు, దర్గామిట్ట సిఐ రోశయ్య, ఎస్‌బి సిఐ 1 వెంకటేశ్వరరావు, సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చదవడం, రాయడంపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థికి చదవడం, రాయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి-2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరు మండలం గాంధీ సంఘం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆకస్మికంగా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ప్రాథమిక దశ నుంచి మంచి అలవాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత పటిష్టంగా ఏర్పాటు చేసేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు పాడి రైతులు సహకరించాలి



**కోవూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని కోవూరు, విడవలూరు మండలాల్లో ఉన్న పాడి రైతులకు సంబంధించిన పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఈ నెల 15వ తేది నుంచి అక్టోబర్ 15వ తేది నుంచి వేయడం జరుగుతుందని, దీనిని పాడి రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి సోకకుండా పాడి రైతులు సకాలంలో టీకాలు వేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. రెండు మండలాలకు సంబంధించి అన్ని ప్రాంతాల్లో పశు సహాయకుల ద్వారా ఈ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా రెండు మండలాలకు సంబంధించిన పాడి రైతులు మేలుజాతి దూడల ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాల్లో టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## గిరిజనులకు ప్రొవిజన్స్ సర్టిఫికేట్ కల్పించండి



**కొడవలూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** మండలంలోని నార్త్ రాజుపాలెం పంచాయతీ టపా తోపు గిరిజనులకు ప్రొవిజన్స్ సర్టిఫికెట్లు మంజూరు చేసి ఇవ్వాలని సోమవారం తహసి ల్దార్ కార్యాలయంకు చేరుకుని తహసి ల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి కి విన్నవించుకు న్నారు. తహసిల్దార్ మాట్లాడుతూ రిసర్వే చేయకముందు పట్ట భూమి, ఇప్పుడు గ్రామకంఠం, ఎల్ పి ఎం 65 క్రింద భూమి ఉంది ఆ భూమికి ప్రొవిజన్స్ సర్టిఫికెట్లు ఇవ్వమని అడుగుతున్నారు. సంబంధిత వీఆర్ఓ ని ఆ భూమి వద్దకు పంపి రికార్డులు పరిశీలన చేసి పూర్తి నివేదిక జిల్లా అధికారులకు తెలియపరచి వారి ఆదేశాలతో పరిష్కారం చేయడం జరుగుతుందని తెలపడంతో గిరిజనులు వెనుతిరిగారు. 4 అర్జీలు రైతుల నుండి ఇవ్వడం జరిగింది వచ్చిన అర్జీలు సర్వే సమస్యలు, మోటేషన్ కొరకు వచ్చినవి వీటిని కూడా పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

## రైతులకు అవగాహన సదస్సు,ర్యాలీ ఏవో శ్రీలక్ష్మి



**విడవలూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సచివాలయం నందు రైతుల కు అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ శ్రీ లక్ష్మి అద్వర్యంలో నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ అధిక మోతాదులో యూరియా వాడాలి తద్వారా భూమి కక్షరత్వం పెరగడమే కాకుండా చీడపీడలు పెరిగే అవకాశం ఉంటుందని వివరించి తెలిపారు. ప్రతి ఒక్క రైతు యూరియో వినియోగాన్ని తగ్గించి జీవన ఎరువులు లాంటి అవలించాలని తెలిపారు. అదేవిధంగా రైతులు జీవని ఎరువులు వాడడం వలన భూమిలో లభ్యం గాని స్థితిలో ఉన్న పోషకాలు కరిగి మొక్కకు అనేటువంటి తత్వం పెరుగుతుందని సూచించారు. ముఖ్యంగా నవధాన్యాలు వరి భూమిపై చల్లడం ఎంతో ఉపయోగకరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విడవలూరు పి ఏ సి ఎస్ చైర్మన్ పొన్నలూరు పురంధర్ రెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## సీసి రోడ్డు నిర్మాణం కోసం స్థల పరిశీలిన



**సీతారామపురం సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** సీతార మపురం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో గాంధీ విగ్రహం సమీపంలో సిసిరోడ్డు నిర్మాణం కోసం స్థల పరిశీలనను పంచాయితీరాజ్ అధికారులతో కలిసి మండల వైసిపి కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి పర్య వేక్షించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు ఎంపిపి నిధులతో సిసిరోడ్డు నిర్మాణం చేపట్టేందుకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో వున్న గాంధీ విగ్రహం సమీపంలో స్థలాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి బాలినేని మాబయ్య ,పంచాయితీరాజ్ ఏఇ చిన్నయ్య, వైసి నాయకుడు లకిడి బ్రహ్మయ్య,పిడుగు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసులురెడ్డిని పరామర్శించిన నల్లపరెడ్డి

**ఇందుకూరుపేట, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలం నిడి ముసలి గ్రామంలో కోవూరు నియోజకవర్గ వైసీపీ ఇంటిలిజ్యువల్ అధ్యక్షులు కొడ్లపూడి శ్రీనివాసులురెడ్డికి గుండెకు స్టంట్ వేయడంతో ఇందుకూరుపేట మండలం నిడుముసలి గ్రామంలోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వారిని అడిగి తెలుసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించిన మాజీ మంత్రి వర్యులు వైఎస్సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్న జొన్నవాడ దేవస్థానం చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, కుడితిపాలెం సర్పంచ్ సురేష్, వైసీపీ సీనియర్ నాయకులు జైరామ్, కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌టీయు అధ్యక్షులు బిరదవోలు రూప్ కుమార్‌రెడ్డి, మెట్ట వెంకట రమణరెడ్డి, చుండూరు సుధీర్‌రెడ్డి, స్థానిక వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో రేపటి నుండి ఘనంగా ప్రధాని జన్మదినోత్సవం, విశ్వకర్మ జయంతి కార్యక్రమాలు



**నెల్లూరు అగ్రికల్చర్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75వ జన్మదినోత్సవాన్ని విశ్వకర్మ జయంతి కార్యక్రమాలను భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నెల్లూరులో గనంగా నిర్వహించేందుకు నిర్ణయించామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు శిపారెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. నల్లూరులోని బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యాలయంలో ఆయన ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడారు. ఈ నెల 17న ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని వివరించారు. అదేవిధంగా విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని కూడా ఘనంగా చేయడం జరుగుతుందన్నారు. 17న ప్రధాని జన్మదినం సందర్భంగా బుధవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛత అభియాన్ కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, కమ్యూనిటీ కేంద్రాల వద్ద ప్రధాని ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం, ప్రధాని జీవితంపై చిత్ర ప్రదర్శన పుస్తకాలు పంపిణీ, నమోమారథాన్ థీమ్, ఆత్మ నిర్భర భారత్, వికసిత్ భారత్‌పై యువ మోర్చా నేతృత్వంలో ర్యాలీ నిర్వహించడం, సామాజిక సాహిత్య కార్యక్రమాలు, క్రీడలు, కళలు, విద్యా మొదలగు రంగాలలో కృషి చేసిన వ్యక్తులను సన్మానించడం, దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేయడం లాంటి సేవా కార్యక్రమాలను అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాలలో భారతీయ జనతా పార్టీ నేతలు, కార్యకర్తలు అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

– గీతాంజలిలో స్వచ్ఛంధ రక్తదాన శిబిరం




**కోవూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ప్రముఖ భారతీయ సివిల్ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 58వ జయంతిని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. రక్తదానం చేయడం అనేది మరొకరికి ప్రాణదానంతో సమానమన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి వై. మురళీకృష్ణ మాట్లాడుతూ తమ కళాశాల కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను సమాజానికి ఉపయోగపడే అనేక కార్యక్రమాలను తరచుగా నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. ఈ సందర్భంగా దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి కళాశాల ఇంజనీరింగ్ విద్యార్థులు స్వచ్ఛందంగా 120 యూనిట్ల రక్తదానాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, పేథాలజీ విభాగాధిపతి డాక్టర్ ఫామీనా, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ అనిత, డాక్టర్ వినీత, డాక్టర్ త్రివిక్రమ్, డాక్టర్ బాలాజీ , తదితరులు ఉన్నారు.

## ఆధార్ కేంద్రాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి

**కోవూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** కోవూరు మండల ంలోని అన్ని పంచా యతీల్లో ఈ నెల 20వ తేది వరకు గిరిజ నులకు సంబంధించి ఆధార్ కేంద్రాలను సంబంధిత పంచా యతీ కార్యాలయాల్లో నిర్వహిం చడం జరుగుతుందని, వీటిని ఆయా పంచాయతీ పరిధిలో ఆధార్ లేని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సోమవారం వేగూరు పంచాయతీలో ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయగా.. ఈ ప్రాంత వాసులు దానిని పూర్తిగా సద్వినియోగం చేసుకున్నారన్నారు. మంగళవారం చెర్లోపాలెం, మోడేగుంట పంచాయతీల్లో నిర్వహించడం జరుగుతుందని, ఆయా పంచాయతీలకు సంబంధించి నేటి వరకు ఆధార్ తీసుకోని గిరిజనులు ఈ కేంద్రానికి వచ్చి చేయించుకోవాలన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో పండించే పంటలు ఆరోగ్యం: తహసిల్దార్



**కొడవలూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** మండలం లోని ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పంటలు ఆరోగ్యానికి ఎంతో శ్రేష్టకరమని తహసీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవా రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన మరియు అమ్మకం కార్యక్రమాన్ని పకృతి వ్యవసాయ టీం ఏర్పాటు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుగు మందులు, ఎరువులు కూరగాయల పంటలపై వేయకుండా ప్రకృతి వ్యవసాయంతో పకృతి టీం రైతు నుండి నేరుగా వినియోదారులకు,మంచి ఆకుకూరలు, కూరగాయలు అందించడం మంచి కార్యక్రమమని తెలియజేశారు. అనంతరం వినియోగదారులకు ఆకుకూరలు అమ్మకం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్, సారంగపాణి, మండల వ్యవసాయ అధికారిని ఎస్ విజయలక్ష్మి,వీఆర్వోలు శ్రీనివాసులు, సుబ్బయ్య, ప్రసాద్, యు.సురేష్, సిహెచ్ వెంకటేశ్వర్లు, ఏడుకొం డలు, పకృతి టీం సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

– వెటర్నరీ పోలి క్లినిక్ వైద్యులు టి.సోమయ్య



**నెల్లూరు అగ్రికల్చర్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** పశు వ్యాధి నియంత్రణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ పాలీ క్లినిక్ వైద్యులు, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.సోమయ్య పిలుపునిచ్చారు. సోమ వారం నెల్లూరు అర్బన్ ప్రాంతంలోని ఎన్టీఆర్ నగర్లో పశు వ్యాధి నియంత్రణ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి టీకాలు వేయిద్దాం- పశువులను కాపాడుకుందాం అని సూచించారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా ఈనెల 15వ తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి టీకాలను వేయడం జరుగుతుందని వివరించారు. ఇందులో భాగంగా నాలుగు బృందాలు నెల్లూరు నగరంలో గాలికుంటు వ్యాధి టీకాలను పశువులకు వేయ డం జరుగుతుందని తెలిపారు. పశువులు ఆరోగ్యంగా బలంగా జీవించేందుకు ఈ టీకాలు దోహదప డతా యని తెలిపారు. ఈ అవకాశాన్ని పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో పశు వైద్యులు డాక్టర్ సీహెచ్ రామచంద్రరావు, డాక్టర్ జి.చైతన్య, పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం వైద్యులు డాక్టర్ స్రవంతి, వెటర్నరీ విద్యార్థులు, పాలిటెక్నిక్ విద్యార్థులు, గోపాల మిత్రులు, పశు యజమా నులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17 నుండి జరిగే పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించాలి



**కావలి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఒకటో పట్టణ అధ్యక్షులు మంద కిరణ్ కుమార్ అధ్యక్షతన సోమ వారం పార్టీ కార్యాలయం నందు ఈనెల 17 వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం నుండి అక్టోబర్ 2 మహాత్మా గాంధీ జయంతి వరకు జరిగే పక్షోత్సవాలను కావలి పట్టణంలో ఘనంగా నిర్వహించాలని సోమవారం పట్టణ సమావేశంలో చర్చించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు ఈ నెల 17 తేదీన భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే సెప్టెంబర్ 25 వ తేదీన పండిట్ దీన్ దయాల్ దయాల్ ఉపాధ్యాయ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు.పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించడం మరియు అమ్మ పేరుతో మొక్కలు నాటడం , పేదల నివసించే ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు సేవా పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంచిపాకు కమల,ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుసు వెంకటేశ్వర్లు,జిల్లా టెలికమ్ అడ్వైజరీ కమిటీ సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, జీఎస్టీ మండలి సభ్యులు అమరా వెంకట సుబ్బారావు, జిల్లా కోశాధికారి సి వి సి సత్యం, పట్టణ ప్రధాన కార్యదర్శి గుడిపల్లి ప్రసన్న కుమార్, ఉపాధ్యక్షులు కోడూరు మురళీకృష్ణ, సుందరశెట్టి సుజి, కార్యదర్శి మట్టా మల్లికార్జున, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షులు మంగమూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## నివాస ప్రాంతాల మధ్య మద్యం షాపును నిలిపివేయాలి



**కావలి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** నివాస ప్రాంతాల మధ్య పెట్టబోతున్న మద్యం షాపును పెట్టనీయకుండా నిలుపుదల చేయాలని కావలి పట్టణ రామ్మూర్తి పేట,పుల్లారెడ్డి నగర్ ప్రాంత వాసులు సోమవారం కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణను కలిసి వినతి పత్రాన్ని అందజే యడం జరిగింది ఈ సందర్భంగా ఆప్రాంత వాసులు మాట్లాడారు కావలి పట్టణంలోని బొద్దుకూరు వారి వీధి ప్రారం లోని జిఎస్టి రోడ్డు తూర్పున గాదంశెట్టి మారుతి, నేరెళ్ళ శివ ప్రసాద్ లకు సంబంధించిన కాళీ స్థలంలో మద్యం షాపును పెట్టుటకు సిద్ధమవుతున్నారని తెలియజేశారు ఈ మద్యం షాపు పెట్టబోవు ప్రదేశంలో చుట్టుపక్కల నివాసాలు ఉంటున్నరని పక్కనే సత్యనారాయణ స్వామి ఆలయం కూడా ఉందని రెండు కళాశాలలు, రెండు పాఠశాలలు,కిండర్ గార్డెన్, కళ్యాణ మండపం,రిలయన్స్ మార్ట్, మహిళలు పనిచేసే గార్మెంట్ ఉన్నాయని తెలియజేశారు. నిత్యం ఈ ప్రాంతం గుండా ఎంతో మంది మహిళలు ప్రజలు ఏ సమయంలో అంటే ఆ సమయంలో రాకపోకలు సాగిస్తుంటారని తెలియజేశారు.ఈ ప్రాంతంలో మద్యంషాపు పెట్టినట్లయితే కళాశాల, పాఠశాల విద్యార్థులు, గుడికి వెళ్లే వారికి, పెద్దలు ,స్త్రీలు అనేక ఇబ్బందులు పడుతారని తెలియజేశారు.ఈ ప్రాంతంలో మద్యం షాప్ ను పెట్టనీయకుండా చేయాలని కోరడం జరిగిందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆ ప్రాంతవాసులు మరియు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

## యూరియా వాడకం తగ్గించి నవధాన్యాల కిట్స్‌పై దృష్టి పెట్టాలి



**కోవూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** వ్యవసాయం సాగు చేసే రైతులు యూరియా వాడకం తగ్గించి నవధాన్యాల కిట్స్ సాగు చేసుకుని కలియ దున్నడం వలన భూసారం పెరుగుతుందని వ్యవ సాయ సహాయ సంచాలకులు అనిత అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు సచివాలయంలో సోమవారం యూరియా వాడకంపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియాను వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులో వాడకుండా తమ ఇష్టాను సారంగా వాడడం వలన వరిపైర్లలో చీడపీడలు ఎక్కువై రైతుకు వ్యవసాయం ఖర్చు పెరిగి దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి రైతు భూసార పరీక్షలు నిర్వహించుకుని దానికి అనుగుణంగా ఎరువులు పురుగుమందులు వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారిణి రజని, గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు కీర్తన, రైతులు ఉన్నారు.

## పౌష్టికాహార మాసోత్సవాన్ని విజయవంతం చేయాలి



**కోవూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** కోవూరు ఐసీడీఎస్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16వ తేది వరకు పౌష్టికాహార మాసోత్సవాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీడీపీవో టి. శారద అన్నారు. కోవూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బుచ్చి, కోవూరు మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తలకు పౌష్టికాహార మాసోత్సవాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే కాకుండా కేంద్రాల పరిధిలోని గర్భవతులకు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ముఖ్యంగా తక్కువ ఖర్చుతో తయారు చేసుకునే పౌష్టికాహార వంటలపై వారిలో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలపై ప్రతి కేంద్రం పరిధిలో ఉన్న తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు చేసుకుంటే ఏ విధమైన ఇబ్బందులు వస్తాయో వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి నెల 10వ తేది లోగా చిన్నారుల యొక్క బరువు, ఎత్తు తూచి ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. రికార్డు రిజిస్టర్ల నిర్వహణ పారదర్శకంగా చేపట్టాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ప్రమీల, ఉమా, నాగభూషణమ్మ, శకుంతల, తదితరులు ఉన్నారు.

## మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు

– ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెల్నెస్ సెంటర్స్‌ను తనిఖీ చేసిన డా. ఖాదర్వల్లి



**పొదలకూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసమే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు వైద్య శాఖ అధికారి, జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసి, క్షయ నివారణ అధికారి డా.ఖాదర్వల్లి పేర్కొ న్నారు. సోమవారం మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, తాటిపర్తి హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో ఈ కార్యక్రమం జరుగు షెడ్యూల్ డేట్స్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్, అంగనవాడి, మహిళా సంఘాలకి ఈ కార్యక్రమం ఉద్దేశం తెలుపుతూ వీరితో ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని సమావేశం నిర్వహించి ఈ ప్రోగ్రాంని సక్సెస్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం జరుగు ప్రదేశంను షెడ్యూల్ ప్రకారం ముందే గుర్తించి ఆ కార్యక్రమానికి అవసరమైన ప్రదేశ వసతులు సమకూర్చాలన్నారు. ఈ కార్యక్రమం నందు గర్భిణీ స్త్రీలు, మహిళలు, కౌమార దశ బాలికలు, వ్యాధి నిరోధక టీకాలు పొందు పిల్లలు వారి తల్లులు వారు ఈ కార్యక్రమం నందు పాల్గొనే విధంగా అవగాహన కల్పించాలని, ఆశాలు హౌస్ టు హౌస్ తిరిగి ఈ కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ విజయ్ ఆయన వెంట ఉన్నారు.

## సీఎం, జిల్లా అధికారుల వీడియో కాన్ఫరెన్స్ ను వీక్షిస్తున్న మండల అధికారులు



**కొడవలూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవా రం వీడియో కాన్ఫరెన్స్ జరిగినట్లు ఏవో రాంప్ర సాద్ తెలిపారు.జిల్లా అధికారులతో రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సచివాల యంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ మాట్లాడు తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభు త్వం ప్రవేశపెడుతున్న పథకాలు గురించి ప్రతి జిల్లాలో ప్రజలకు ఏ విధంగా చేరుతు న్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆర్థిక శాఖ, స్వచ్ఛభారత్ , మౌలిక సదుపాయాలు, సంక్షేమం పథకాలు ప్రవేశ పెట్టే విధానాన్ని జిల్లా అధికారులకు సీఎం తెలియజేశారు. జిల్లా అధికారులతో ఆదేశాలతో మండల కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ను వీక్షించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

## తూర్పుదొరువు అభివృద్ధికి చర్యలు



**జలదంకి,సెప్టంబర్ 15 ,ప్రభాతవార్త :** స్థానికతూర్పు దొరువు అభివృద్ధికి సోమవారం చర్యలు చేపట్టారు .పంచాయతి ఉపసర్పంచ్ కూరపాటి మాలకొం డారెడ్డి,(చిన్న),పంచాయతి కార్యదర్వులు వెంకట 'శ్వర్లు, మౌనికారెడ్డిలు,సచివాలయ సిబ్బంది పూజలు చేసి పనులు ప్రారంబించారు.గ్రామ తూర్పు బాగాన పూర్వం ఈ దొరువును నిర్మించారు.వేసవిలో మూగ జీవుల దాహర్తి తీర్చేందుకు,అలాగేచుట్టుప్రక్కల భూగర్భ జలాలు పెరిగి బావులలో నీటిమట్టం తగ్గకుండ వుండేందుకు దొరువు నిర్మాణం జరిగింది.అయితే ఇటీవల దొరువు శిదిలావస్థకు చేరింది.మురుగునీటితో తాండవమాడుతుంది.దీంతో పంచాయతి ఉపసర్పంచ్ దీపిపై దృష్టిమం ల్చారు.స్థానిక పెద్దలతో చర్చిం చారు.అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఉదయగిరి ఎంఎల్ఏ కాకర్ల సురేష్ ఆదేశాలతో పనులకు శ్రీకారంచుట్టారు.కట్ట పటిష్టత,మురుగునీటి నిల్వలు లేకుండా చేయుట వంటివి చేసి సుందరంగ తీర్చిదిద్దుతామని ఈసందర్బంగ ఉపసర్పంచ్ మాలకొండారెడ్డి వివరిం చాడు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



**కావలి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కావలి రూరల్ మండలం గౌరవరం జాతీయ రహదారిపై జరిగింది.కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు ఊరు, పేరు అడ్రస్సు వివరములు తెలియని సుమారు 30 సంవత్సరముల నుండి35 సంవత్స రముల లోపు వయసు గల మగ వ్యక్తి ఆదివారం అర్ధరాత్రి సమయంలో కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామ సమీపంలోని నర్సరీ దగ్గర ఉన్న జాతీయ రహదారి దాటుతుండగా ఒంగోలు వైపు నుండి నెల్లూరు వైపుకు వెళుతున్న ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొని బలమైన రక్తగాయాలయి అక్కడికక్కడే మృతి చెందడం జరిగిం దన్నారు. చనిపోయిన వ్యక్తి ఎవరని తెలిసినట్లయితే కావలి రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి.రాజేశ్వరరావుకి లేదా సిహెచ్.తిరుమలరెడ్డి కి తెలియచేసి, వారిని సంప్రదిం చవలసి ందిగా కోరుచున్నామని తెలియజేశారు.

## 69వ స్కూల్ గేమ్స్‌కు దరఖాస్తు చేసుకోండి : ఎంఈఓ



**ఉదయగిరి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** మండలకేంద్రమైన ఉదయగిరిలోని 69వ ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 25కు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఉదయగిరి ఎంఈఓ టి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అండర్ 14, 17 విద్యార్థులు ఆయా క్రీడల పోటీలలో పాల్గొనేందుకు లీఫ్ యాప్ నందు పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 17,18,19వ తేదీల్లో మండల స్థాయి సెలక్షన్ ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఈ అన్నదాత కార్డు పొందిన ప్రతి రైతుకు రూ. 5 ఐదు లక్షల బీమా



**నెల్లూరు కార్పొరేషన్,సెప్టెంబర్ 15,ప్రభాతవార్త:** ఈ అన్నదాత కార్డు పొందిన ప్రతి రైతుకు 5 లక్షల రూపాయలు బీమా వర్తిస్తుందని భీమా వర్తిస్తుందని న్యూ అస్పి రెంట్స్ సాఫ్ట్వేర్ కంపెనీ గుణిశేఖర్ తెలిపినట్లు ఆ సంస్థ సభ్యుడు సాయికుమార్ తెలిపారు. సోమవారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అన్నదాత కార్డు పొందిన రైతు కు ప్రమాద బీమా కింద రూ. 25 లక్షలు వర్తిస్తుందని తెలియజేసారు. రైతు కిసాన్ కార్డుతో 500 రూపాయలు నుండి అంతకంటే ఎక్కువ కొనుగోలు చేస్తే ప్రతి కొనుగోలు పై 40 శాతం రాయితీ లభించనునట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా రైతులకు కావాల్సిన మరెన్నో సదుపాయాలను ఈ అన్నదాత కార్డు ద్వారా సన్నా, చిన్న కారు రైతులందరూ రాష్ట్ర ఈ అన్నదాత పార్ట్నర్ ఆయుష్ ఇన్ఫో సర్వీసెస్ అధినేత మంచరి సోమశేఖర్ రావు సూచించినట్లు తెలిపారు. దేశానికి రైతే వెన్నుముక అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వంలో ప్రధాని నరేంద్ర మోడీ దేశానికి పక్షపాతిగా ఎన్నో పథకాలను ప్రారంభి ంచడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా పి ఎంసిసి కిసాన్ ఆన్మోల్ క్యాంటీన్ కార్డు పథకం రైతుల సహాయ కేంద్రం ను రాష్ట్రం అంతటా నిర్వహిం చడానికి ఆయుష్ ఇన్ఫో సర్వీసెస్ సేవా శాఖ ద్వారా ఈ అన్నదాత కార్డులను రైతులకు అంద జేయడానికి ప్రభుత్వంతో భాగస్వామ్యం కావడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో గుణశేఖర్ శెట్టి, రాజేంద్ర, నారాయణమూర్తి, రామకృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు

## రైతు సమస్యలపై ఆర్.పి.ఐ పార్టీ నేతలు కలెక్టర్‌కు వినతి



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలి అని వర్షాల వల్ల నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపోయిన వారికి నష్టపరిహారం అందించాలని రైతులకు ఈసారి ఖరీఫ్ పంటలో ఎటువంటి అన్యాయం జరగకుండా చూడాలని సోమవారం కలెక్టరేట్లో తిక్కన ప్రాంగాణంలో జరిగే పి జి ఆర్ ఎస్ గ్రీవెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కి వినత పత్రం అందజేసిన ఆర్‌పిఐ పార్టీ నేతలు వినత పత్రం అందజేసారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్ కె మాబు మీడియాతో మాట్లాడుతూ రైతులకు దాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని వర్షాల వల్ల నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపోయిన వారికి నష్టపరిహారం అందించాలని రైతులకు ఈసారి ఖరీఫ్ పంటలో ఎటువంటి అన్యాయం జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్‌ని కోరినట్టు ఆయన తెలియజేశారు. రైతులు ఈ ప్రపంచానికి వెన్నెముక లాంటి వారిని అలాంటి రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. రైతులకు గత ఏడాది లాగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసే వారి వారి బ్యాంకు ఖాతాల్లో నగదు చెల్లించాలన్నారు. ఈసారి ప్రస్తుతం పండించిన పంటకు గత సంవత్సరం తరహాలో రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జిల్లాలో అభం శుభం తెలియని రైతులకు మాయ మాటలు చెప్పి రైతుల కష్టాలను దోచేస్తున్న దళారీ వ్యవస్థను తరిమికొట్టి వారి పైన చట్టపరంగా శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఉక్కు పాదంతో అణిచివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టపు రంగారావు, ఉపాధ్యక్షులు బత్తల మధుసూదన్, దుంపల సుబ్బారావు, నంబూరు గణేష్, ఉప్ప నూరు మాలకొండయ్య, తూపిలి వంశీకృష్ణ, బెల్లంకొండ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## దేవుడు భూమి ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** ముత్తుకూరు మండలం మామిడిపూడి గ్రామ రెవెన్యూకి సంబంధించిన సర్వే నెంబర్ 1501, ఎల్పిఎం నెంబర్ 472 గుంట పోరంబోకుగా రెవిన్యూ రికార్డులో నమోదు చేసి ఉన్నారని. భూమి కొన్ని దశాబ్దాల కాలం నుంచి మామిడిపూడి గ్రామ శక్తిగా పేరుగాంచిన ఐపోలయ్య స్వామి పుట్టలు ఉన్నాయిని ప్రతి సంవత్సరం ఉగాది నాడు గ్రామస్తులు అందరూ కలిసి దేవుడికి కొలువు చేసుకుంటున్నారని, ఐపోలయ్య స్వామి పుట్టలు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని తాళ్లపూడికి చెందిన కొంతమంది వ్యక్తులు దానిని ఆక్రమించి దేవుడికి సంబంధించిన భూమిని ఆక్రమించడం ఏమిటని ప్రశ్నిస్తే మాపై దౌర్జన్యం చేస్తున్నారని, అడ్డగించిన భూమికి సంబంధించిన విషయాన్ని ప్రభుత్వాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదన్నరు. ఆ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని భూమి తిరిగి గ్రామానికి సంబంధించిన ఐపోలయ్య స్వామి భూమిగా గుర్తించి ఇవ్వవలని కోరారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే మంత్రి నారాయణ లక్ష్యం



**నెల్లూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త – వైద్యం :** పేదల ఇళ్ల నిర్మాణానికి ఎన్డీఏ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు 47వ డివిజన్ కార్పొరేటర్ రామకృష్ణ సూచించారు. నెల్లూరు సిటీ 47వ డివిజన్ సచివాలయంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు కొండ్లపూడి 9,10 లేఔట్ లబ్దిదారులతో హౌసింగ్ ఈఈ మోహన్‌రావు, ఏఈ భాస్కర్, సెక్రటరీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా 47వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన లబ్దిదారులతో మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నెల్లూరులో మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు ప్రజా సంక్షేమ పరిపాలన కొనసాగుతుందని తెలిపారు. గతంలో లబ్దిదారులకు ఇంటి స్థలాలు మంజూరు చేయబడి, కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.1,80,00 సాయం అందించి కానీ ఇళ్ల నిర్మాణం పూర్తి కాని లబ్దిదారులకి ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బీసీ, ఎస్సీ లబ్దిదారులకు రూ.50వేలు, ఎస్టీ లబ్దిదారులకు రూ.75వేలు అదనంగా మంజూరు చేస్తున్నారని తెలిపారు. దీని ద్వారా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. అదే విధంగా సమాచారం కోసం కొండ్లపూడి లేఔట్‌లో హౌసింగ్ ఆఫీసును టీడీడీసీఓ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా సచివాలయ సిబ్బంది సైతం సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అందరి సమిష్టి కృషితో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా పొట్లూరు రామకృష్ణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ ఈ.చెంగయ్య, యూనిట్ ఇన్‌చార్జీ రెహమాన్, కోట్లపాటి రాజా, బీఎల్‌సీ పిల్ల ప్రసాద్, జహూర్ అహ్మద్, ఆర్‌వీ గిరి, ముని కుమార్, సెక్రటరీ సీహెచ్ గిరిధర్, దువ్వూరు నరేంద్ర, మైనార్టీ ప్రెసిడెంట్ ఫిరోజ్, మహిళా ప్రెసిడెంట్ చైతన్య, రవి సింగ్, కంచి చంద్ర, టి.చంద్ర, మహంకాళి సురేంద్ర, జకీర, సునీత పాల్గొన్నారు.

## బోగోలు పంచాయతీ కార్యదర్శి అవినీతి పైన సమగ్ర విచారణ జరపాలి

**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** బోగోలు పంచాయతీ కార్యదర్శి అవినీతి పైన సమగ్ర విచారణ జరపాలని సోమవారం జిల్లా కలెక్టర్ కు మాజీ ఉపసర్పంచ్ మద్దిబోయిన వీరరఘు ,పాలక వర్గ సభ్యులు పిర్యాదు చేశారు.గతంలో మీ దృష్టికి తెచ్చిన పిర్యాదుకు సంబంధించి విచారణ అధికారిగా కావలి డివిజన్ పంచాయతీ అధికారిని నియమించారని, అయితే పిర్యాదు లో పేర్కొన్న అంశాలు విచారణ లో సక్రమంగా జరగలేదన్నారు. తాత్కాలికంగా ప్రైవేట్ బిల్ కలెక్టర్ ను పంచాయతీ కార్యదర్శి తొలగిస్తూనట్లు ప్రకటించారన్నారు. విచారణ లో ఇంటిపన్నుల రసీదుల రికార్డులు, ఫోన్ పే రికార్డులు పూర్తి స్థాయిలో పరిశీలన చేయలేదన్నారు. అంతేకాకుండా పారిశుధ్య పనుల కొరకు చేసిన జమఖర్చులు పైన విచారణ జరగలేదన్నారు. పంచాయతీ కీ సంబంధం లేని ఇద్దరు వ్యక్తులకు 92 వేల రూపాయలు చెల్లించారని దీనిపైన విచారణ జరపాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. లేని పక్షంలో తమకు న్యాయం జరగకపోతే లోకాయుక్తను ఆశ్రఇస్తామని పేర్కొన్నారు.

## మెప్మా ద్వారా ప్రజలకు అందుబాటులో డిజిటల్ సేవలు



**నెల్లూరు సిటీ, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** డిజిటల్ సేవల ద్వారా ఉపాధి అవకాశాలు పొందుటకు పట్టణ ప్రాంతంలో అర్హత కల్గిన మహిళలను గుర్తించి వారికీ డిజి సర్వీస్‌లపై అవగాహన కల్పించడం జరుగుతుంది సి యస్ సి డిస్ట్రిక్ట్ మేనేజర్ సుల్తాన్, పోస్టల్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ సుధాకర్, ఐ బి అంకయ్య శిక్షణ ఇచ్చారు. మెప్మా చేపట్టిన డిజి లక్ష్మిల ద్వారా ప్రజలకు డిజిటల్ సేవలు అందుబాటులో కి తెస్తుంది. ఈ కార్యక్రమం లో సీఎంఎం జరిన, కవిత, డిఆర్పి జయశ్రీ పాల్గొన్నారు.

## వినాయక కాలనీకి కరెంటు లైన్ వెయ్యాలి



**కావలి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త: :** కావలి పట్టణంలోని ముసునూరు వినాయక కాలనీకి కరెంటు లైన్ వేయాలని అక్కడ ప్రజలు సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఈఈ కే.ఎస్. బెనర్జీకి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అక్కడ ప్రజలు మాట్లాడారు వినాయక కాలనీ ఏర్పడి పది సంవత్సరాలు పైబడిందని ఇప్పటివరకు కరెంటు లైన్ వేయలేదని తెలియజేశారు. సుమారు అర కిలోమీటరు దూరం నుండి కర్రలపై వైర్లు లాక్కొని కరెంటు వెలిగించుకుంటున్నామని తెలిపారు.కొంతమందికి మీటర్లు ఉన్నాయని కరెంటు బిల్లులు కూడా ప్రతి నెల చెల్లిస్తున్నామని కరెంటు లైన్ వేయాలని ఎన్నోసార్లు కరెంటు ఆఫీస్ చుట్టూ తిరిగామని ఇదిగో అదుగో అని కాలయాపన చేస్తున్నారని తెలియజేశారు. వర్షం పడినప్పుడు, గాలి వీచినప్పుడు కర్రలు విరిగిపోయి వైర్లు కింద పడుతున్నాయని దీని వలన అక్కడ తిరిగే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని కర్రలు విరిగిపోయినప్పుడు కరెంటు ఉండదని కరెంటు లైన్ లేనందున చాలా ఇబ్బందులు గురి అవుతున్నామని తెలిపారు మరలా వినతిపత్రాన్ని ఇచ్చి ఇబ్బందులు తెలియజేశామని తెలిపారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య నాయకులు జి. మధుసూదన్ రావు, పి. తిరుపాలు పాల్గొని మాట్లాడారు కరెంటు లైన్ లేనందున అక్కడ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని కర్రలపై వైర్లు లాగితే కర్రలు పడిపోయినప్పుడు ప్రమాదం జరిగే పరిస్థితి ఉంటుందని ఈ సమస్యని గమనించి ఎలక్ట్రికల్ అధికారులు కరెంటు లైన్ వేయాలని డిమాండ్ చేశారు. అలా జరగని ఎడల స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో స్థానికులు ఎస్కె. షాపిర, ఎస్.కె అస్మత, జి. శ్రీకాంత్ మరి కొంతమంది పాల్గొన్నారు.ఇట్లు పి.పెంచలయ్య సీపీఎం నాయకులు

## నిష్పక్షపాతంగా కలువాయి మండల రెవెన్యూ అధికారులు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా కలువాయి మండలం గోపారం సచివాలయ పరిధిలోని చింతల్ ఆత్మకూరు గ్రామ రెవెన్యూ గల సర్వేనెంబర్ 32 సి1 లో గల నాలుగు ఎకరాల ఆరు సెంట్లు భూమిలో సంక్రమించిన 39 సెంట్లు భూమికి హద్దులు చూపించాలని ఆ గ్రామానికి చెందిన ఎస్ నిరంజన్ సోమవారం ప్రజా విజ్ఞప్తిల దినంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా గ్రామానికి చెందిన పి శివశంకర్ భార్య వైదేహి ఈ భూమిని ఆక్రమించుకొని నాపై దౌర్జన్యం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ పొలంలో పైలు సాగు చేసుకునేందుకు వెళితే ఆటంక పరుస్తున్నారన్నారు. పొలం దగ్గరికి వెళితే చంపుతామని బెదిరిస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించగా తాసిల్దార్ స్పందించి ఈ భూమికి రాళ్లు వేసి ఇచ్చాదన్నారు. వేసిన రాళ్ళను సదరు వైదేహి ఆమె అనుచరులు ఈ రాళ్ళను పీకి వేసి నారన్నారు. స్థానిక ఎస్పికు ఫిర్యాదు చేయగా అతని పట్టించుకోలేదన్నారు. అందువల్ల చింతలాత్మకూరు సర్వే నెంబర్ 32 సి 1 భూమిని సర్వే చేయించినా 39 సెంట్లు భూమి నాకు ఇప్పించి న్యాయం చేయాలని ఆయన కలెక్టర్ కోరారు.

## యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి జాయింట్ కలెక్టర్‌కి యానాదుల సంక్షేమ సంఘం వినతి



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో జరుగుతూన్న ప్రజా సమస్యల, పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించర దీంతో పాటు పలు కాలనీలకు సంబంధించిన యానాదుల సమస్యలను జెసికి విన్నవించడమైనది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య, జిల్లా చైర్మన్ రాపూరు కృష్ణయ్య, అధ్యక్షులు మానికల మురళీ, ప్రధాన కార్యదర్శి మాకాని రవీంద్ర బాబు, ఉపాధ్యక్షులు తలపల సాంబయ్య, యల్లంపల్లి పెంచలయ్య, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యల్లంపల్లి రమేష్, మహిళా అధ్యక్షురాలు చేంబేటి ఉష, నగర అధ్యక్షురాలు కల్లూరు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పశుపోషకులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి ఎమ్మెల్యే



**కందుకూరు,సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** పశువులకు గాలికుంటు వ్యాధి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా నివారణ టీకాలు వేయించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గంలోని 78,400 పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఈనెల 15వ తేదీ నుండి వచ్చే నెల 15 వరకు గాలికుంటు నివారణ టీకాలు ఉచితంగా పశుసంవర్ధక శాఖ వైద్యులు వేస్తారని, వీటిని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో పశు సంవర్ధక శాఖ బాధ్యుల ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాలకు సంబంధించిన ప్రచార పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు సంబంధించి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు 78,400 టీకా డోసులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్, అసిస్టెంట్ డైరెక్టర్లు, జివి.చంద్రమోహన్, ఈ. చెన్నకేశవులు, కోవూరు పశువైద్యాధికారి డాక్టర్ వై. శ్రీకాంత్, డిఆర్. ఎస్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

## రచయిత శరత్ చంద్ర చటోపాధ్యాయ పలువురికి ఆదర్శం



**కావలి, సెప్టెంబర్15, ప్రభాతవార్త:** నవల రచయిత శరత్ చంద్ర చెటోపాధ్యాయ పలువురికి ఆదర్శమని కావలి గ్రంథాలయ అధికారి బొమ్మల కోటేశ్వరి తెలియజేశారు. ఇరవయ్యవ శతాబ్దపు ప్రముఖ బెంగాలీ నవలా , కథా రచయిత శరత్ చంద్ర చట్టోపాధ్యాయ్ 149 వ జయంతి నిసోమవారం కావలి పట్టణంలోని వెంగళరావు నగర్ ప్రభుత్వ శాఖ గ్రంధాలయ ఆవరణంలో శాఖా గ్రంథాలయాధికారి బొమ్మల కోటేశ్వరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కావలి శాఖ గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, నెల్లూరు జిల్లా కేంద్ర గ్రంధాలయం ఉప గ్రంథపాలకురాలు ఎస్. సునీత,లోక్ అదాలత్ సభ్యులు,గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు యం.మాలకొండారెడ్డి శరత్ చంద్ర చటోపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు భారతీయ నవల రచయిత శరత్చంద్ర చటోపాధ్యాయ 1876 సెప్టెంబర్ 15 న జన్మించారని తెలియజేశారు. శరత్ చంద్ర సమాజాన్ని వ్యక్తిని లోతుగా అధ్యయనం చేసి సృష్టించిన ఆయన పాత్రలు నవలలు స్థిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు.ఆయన నవలలు తెలుగు వారికి సుపరిచితులని, శరత్ చంద్ర చటోపాధ్యాయ్ నవల రచయితలకు ఆదర్శప్రాయుడని ఆయనను మేధావులు స్ఫూర్తిగా తీసుకొని సమాజాన్ని ప్రభావితం చేసే విధంగా రచనలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూట్యూబర్ కె రమణ సచివాలయం ఉద్యోగులు విజయ, సుప్రజ మరియు పాఠకులు పాల్గొన్నారు.

## అవినీతి వీఆర్వో పై చర్యలు తీసుకోండి

**– కలువాయి మండలం పత్రిక విలేకరులు కలెక్టర్‌కు ఫిర్యాదు**



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** కలువాయి మండలం, కనుపూరుపల్లి పంచాయితీ మజరా గ్రామమైన వెరుబొట్లపల్లి గ్రామ సర్వేనెం. 850 నందు దాదాపు 200 అంకణములలో అక్రమ భవన నిర్మాణం, పశువులు కనీసం నీళ్ళు త్రాగేందుకు లేకుండా సాక్షాత్తు చెక్ డ్యామ్ను ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నట్లు గ్రామస్థుల ఫిర్యాదు మేరకు పత్రిక విలేకర్లు గ్రామానికి వెళ్ళి ఫోటోలు, వీడియోలు తీసుకొనివచ్చి పత్రికలలో, ఎలక్ట్రానిక్ మీడియాల ద్వారా ప్రచురితం, ప్రసరింపజేస్తే ప్రస్తుత బదిలీపై వెళ్ళిన జిల్లా కలెక్టర్ ఆనంద్ విచారణ చేపట్టవలసిందిగా ఇరిగేషన్ అధికారులను ఆదేశించిన విషయం వీదేతమే కలెక్టర్ ఆదేశాలానుసారం కలువాయి మండలం ఏ.ఇ.ఇ. హరికృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారి జయరామయ్యలు కలిసి వెళ్ళి విచారణ చేపట్టి చెక్ డ్యామ్పై ఆక్రమించి అక్రమంగా భవన నిర్మాణం చేపడుతున్నట్లు నిర్ధారించి తహశీల్దారు కలువాయి వారికి నివేదిక ఇచ్చారు. అయినప్పటికి అవినీతి మయంలో మునిగి తేలిన గ్రామ రెవెన్యూ అధికారి జయరామయ్య కొంతమంది గ్రామస్థులతో చేతులు కలిపి మీడియాపై దొంగ స్టేట్మెంట్ రికార్డు చేసి మీడియాకు ఆటంకం కలిగిస్తున్నారని గత 10 సం లుగా ఒకే గ్రామంలో విఆర్ఓగా ఉన్న జయరామయ్య చౌటపల్లి రిజర్వాయర్ జన్యూన్ సర్టిఫికేట్ల విషయంలో అవినీతి విషయమై సస్పెండ్ అయిన దాఖలాలు ఉన్నాయిని, ఇతనితో పాటు కలువాయి మండలంలో పనిచేసిన నలుగురు తహశీల్దార్లు కూడా సస్పెండ్ అయినారని, వి.ఆర్.ఓ. జయరామయ్య మరలా అదే గ్రామానికి వి.ఆర్.ఓ.గా ప్రస్తుతం పనిచేస్తున్నారని సాక్షాత్తు ఇరిగేషన్ అధికారులు అక్రమ భవన నిర్మాణాన్ని కూల్చాలని తహాశీల్దారుకు నివేదిక అందజేసిన కనీసం ఆ వైపు కూడా అధికారులు చూడలేదు. కలువాయి మండలం, నూకనపల్లి గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ అధికారి జయరామయ్య దొంగ పట్టాలు సృష్టించి చెరువులు, కాలువలు, ప్రభుత్వ పొలాలు ఆక్రమించుకుని కుటుంబ సభ్యులు మరియు బంధువుల పేర్లపై ఎక్కించుకొనుటకు రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం నూకనపల్లి నందు రీసర్వే జరుగుతూ వుంటే డికెటి పట్టాలు దొంగవి సృష్టించి బంధువుల పేర్లపై రికార్డుల్లో ఎక్కించుకొనుటకు ప్రయత్నం చేస్తున్నాడు. ఇందుకు అన్ని విధాల నగదే ప్రధానంగా ప్రభుత్వ భూములు చెక్ డ్యాములు ఆక్రమించిన వారికి తాను పనిచేస్తున్న చోట రికార్డుల్లో ఎక్కిస్తూ ఆక్రమించిన వాటికి సపోర్ట్ చేస్తూ మీడియాపై అవినీతి మరకలు పూస్తున్న వారిపై విచారించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదాయానికి గండి పడే విధంగా కలువాయిలో 15 నెలలుగా జరిగిన అడంగల్ 1బి రికార్డులను పరిశీలించి న్యాయం చేయాలని మీడియాపై అసత్య రిపోర్టు తయారు చేసిన తహశీల్దారు, వి.ఆర్.ఓ.లపై విచారణ చేసి న్యాయం చేయాలని, కలువై ఉన్నలానికి చెందిన పత్రిక విలేకరులు పాల్గొన్నారు.

## ఏఎస్‌పేటలో వైభవంగా ఝెలాల ఉత్సవం



**అనుమసముద్రంపేట,సెప్టెంబరు15 ,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని శ్రీహజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లానాయబ్‌రసూల్ వారి దర్గా 252వ గంథమ హోత్స వాల్లో భాగంగా సోమవారం ఝెలాల ఉత్స వాన్ని అత్యంత వైభవంగా నిర్వ హిం చారు.దర్గా వక్ఫ్‌బోర్డ్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహిం చారు. ముందుగా వక్ఫ్‌బోర్డు కార్యాలయం నుండి ఝెలాలను దర్గా ఇఒ షేక్ మహ్మద్ హుస్సే న్ ఆధ్వర్యంలో ఫకీర్ల జరబులు, భక్తి కీర్తనలతో తీసుకెళ్ళి దర్గా సజ్జాదా హాఫీజ్ పాషా ఆధ్వర్యంలో అమ్మాజాన్ మహల్ నుండి మేళ తాళాలతో , బాణాసంచా కాలుస్తూ దర్గాకు చేర్చారు. అనంతరం చంద్రవకంపై అమర్చారు. ఈ సందర్భంగా దర్గా గుమ్మటంపై ఉన్న బంగారు చంద్రవంకను తొలుత శుభ్రపరచి అనంతరం చంద్రవంకను ఝెలాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. భక్తులకు తీర్థాన్ని అందజేశారు. భక్తులు పూలదుప్పట్లను దర్గా గుమ్మటంపై ఉన్న చంద్రవంక, దర్గా చుట్టూ కప్పారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ సైదులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహి ంచారు. ఈకార్యక్రమంలో దర్గా ఇఒ మహ్మద్ హుస్సేన్, గ్రామస్తులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు టీకాలు పంపిణీ

**ఉదయగిరి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని నెమళ్లదిన్నె గ్రామంలో సోమవారం పశువులకు గాలికుంటు హెచ్ఎస్ వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేశారు. నాలుగు నెలలు దాటిన పశువులకు ఈ టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ అత్తర్ తెలిపారు. ఈ టీకాలు కార్యక్రమం అక్టోబర్ 15 వరకు కొనసాగుతుందన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

**డాక్యుమెంట్ పోయినది**

వుమ్మలేటి రమణయ్య తండ్రి సుబ్బరామయ్య, ఫ్లాట్ నెం.106, పావని హోమ్స్ టెక్కెమిట్ట, నెల్లూరు. నేను 05.09.2025 తేదీన పని మీద వెళుతుండగా, ప్రకాశం జిల్లా, మార్కాపురం మండలం, రాయవరం గ్రామ సర్వే నెం.44/2 నందు నా పేరు మీద రిజిష్టరు కాబడిన ఇంటి ఖాళీ స్థలము డాక్యుమెంటు నెం. 493/1988 సంతపేట వద్ద పోయినది. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాకు తెలుపగలరు.
**వుమ్మలేటి రమణయ్య, సెల్: 9848993958**

## మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం ప్రారంభోత్సవం



**నెల్లూరు, సెప్టెంబర్ 15 ,ప్రభాతవార్త –వైద్యం :** ఇంజనీర్స్‌డే సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం ప్రారంభోత్సవం మంగళవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటి బోర్డు ఇంజనీర్స్ అసోసియేషన్ భవనంలో తిరుపతిలో జరిగింది. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఇంజ నీర్స్‌డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ రంగ అభివృద్ధికి గొప్ప సేవలు చేసిన మహానుభావుడైన మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ డైరక్టర్ కే.సంతోష్ రావు, పూర్వపు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ కే.రంగనాథం, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ సంతోషరావు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టిన రోజు సందర్భంగా మనం జరుపుకునే ఇంజనీర్స్ డే రోజు వారి విగ్రహాన్ని ప్రారంభించడం నా జీవితంలో మర్చిపోలేని సంఘటన అని వారు తెలిపారు. ఒక ఇంజనీర్‌గా నా జన్మ ధన్యమైందని భావిస్తున్నాను ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు పిల్లర్స్ రంగనాథం, గోపాల్‌రెడ్డి ఈ కార్యక్రమంలో ఉండడం చాలా చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా నేను ఇంత వరకు ఎప్పుడు తెలుపని విషయం సభాపూర్వకంగా తెలియజేస్తున్నాను నాతో పాటు పని చేసే వారు విద్యుత్ సంస్థలు రిఫార్మ్స్ వచ్చినప్పుడు వెంటనే చీఫ్ ఇంజనీర్ ప్రమోషన్ వస్తుందని ఎస్పీడీసీఎల్‌కు ఆప్షన్ ఇవ్వడం జరిగింది. కానీ నేను అప్పుడు సీఎండీగా ఉన్న రంగనాథం దగ్గర పని చేయాలని ఉద్దేశంతో నేను ఎస్పీడీసీఎల్‌లోనే ఉండడం జరిగిందని తెలియజేశారు. నాకు ఇంకొక కల కాని ఉంది పూర్వపు సీఎండీ గోపాల్‌రెడ్డి మాదిరి పని చేయాలన్నది ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ రంగనాథం గోపాల్‌రెడ్డి పిల్లర్స్ అని తెలియజేశారు. స్పష్టతగా చెప్పడానికి ఈ కార్యక్రమంలో రంగనాథం గోపాల్‌రెడ్డి ఇద్దరూ ఎంతో గౌరవంగా పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. ముఖ్యంగా రంగనాథం ఇంజనీర్స్ వినియోగదారులతో సత్యత, నిజాయితీగా మాట్లాడాలని, సమస్యలను పరిష్కరించేందుకు క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. వినియోగదారులకు అందుబాటులో ఉండడం ద్వారా సంస్థకి మంచి ప్రతిష్ట రావడం సహజమని పేర్కొన్నారు. గోపాల్‌రెడ్డి ఈ ఇంజనీర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌కు ఎంతో చారిత్రక ప్రాముఖ్య ఉందని, ఈ భవనం దేవేందర్ రెడ్డి, శ్రీనివాసరావు వారి కృషితో నిర్మించబడిందని వివరించారు. ఇంజనీర్స్ అసోసియేషన్ మీటింగ్‌లకు క్రమశిక్షణతో పాల్గొనాల్సిన ప్రాముఖ్యతను ఆయన తెలిపారు. ఈ వేడుకలో డైరక్టర్ ప్రాజెక్ట్స్ ఆయుప్‌ఖాన్, ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బాలాజీ, రమేష్, నాగరాజు, డిస్కాం చీఫ్ జనరల్ మేనేజర్లు, జనరల్ మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, డిప్యూటీ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, డిస్కాంలోని ఇతర ఇంజనీర్స్ గణనీయంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను స్మరించి, ఇంజనీర్ పుంజానికి ప్రోత్సాహాన్ని కల్పిస్తూ, విద్యుత్ రంగ అభివృద్ధిలో అందరి కృషి స్ఫూర్తిదాయకమని నిలిపివేయబడింది.

## ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ



**ఉదయగిరి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని దుర్గంపల్లి అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ కేంద్రం ఆదివారం పోలీసులచే బహిర్గత చేయబడింది. హనుమాన్ నాలాకు అర కిలోమీటర్ దూరంలో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి పూట గుట్టుగా నాటుసారా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో బట్టీలలో రెండు డ్రమ్ములు ఊటా ముడి సరుకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఘటన స్థలానికి చేరుకొని బల్లెపు ఊటను ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై శ్రీనివాసులు బట్టీని కొనుగొని బట్టిలపై దాడులు చేసి ధ్వంసం చేశారు. అనంతరం నిల్వ ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ఎక్సైంజ్ శాఖ, పోలీసు శాఖ ఎస్సై 2 శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరుడు యాకుబ్ భాషా వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే



**ఉదయగిరి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల కేంద్రంలోని సినిమా హాల్ వీధిలో షేక్ ధర్వేషా– ఫాతిమాబి దంపతుల కుమారుడు షేక్ యాకుబ్ భాషా వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వివాహ వేడుక కార్యక్రమానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరై నూతన వధూవరులైన యాకుబ్ భాషా– హస్మలను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపి నూతన వధువు హస్మకు కాకర్ల చారిటబుల్ ట్రస్టు తరుపున రూ.10వేలు పెళ్లి కానుకగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అందించారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, కార్యకర్తలు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ చైర్మన్ చల్లాకు సన్మానం



**వింజమూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** వింజమూరు సొసైటీ చైర్మన్‌గా నూతనంగా ఎంపికైన చల్లా వెంకటేశ్వర్లు యాదవ్‌ను వింజమూరు కారు డ్రైవర్స్ అసోసియేషన్ తరుపున ఘనంగా సన్మానించారు. సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో చైర్మన్ చల్లా వెంకటే శ్వర్లును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోసు బాలకృష్ణ, పెంచలయ్య, వెలుగోటి కిషోర్, వెంకట రమణ, వెలుగోటి వెంకట్రావు, మెట్టుపల్లి మురళి, గజ్జల పెంచలయ్య, రమేష్, ఎస్‌కే బాదుల్లా తదితరులు ఉన్నారు.

## ఘనంగా శరశ్చంద్ర చటోపాధ్యాయ జయంతి వేడుకలు



**వింజమూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** వింజమూరులోనే శాఖా గ్రంధాలయంలో గ్రంధాలయాధికారి జ్యోతి కొండయ్య ఆధ్వర్యంలో శరత్ చంద్రచటోపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహి ంచారు. ముందుగా చటోపాధ్యాయ చిత్రపటానికి పూలమాలవేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా కొండయ్య మాటాడుతూ గ్రం ధాలయ అభివృద్ధికి శరత్చంద్ర చేసిన సేవలు అమోఘమని కొని యాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బ్రహ్మయ్య, వాసు, ఓబులు తదితరులు ఉన్నారు.

## ఎంఎల్ఏ ఆదేశాలతో మీకరంటు కష్టాలు తీరినట్టే...కరియావుల



**జలదంకి, సెప్టంబర్15, ప్రభాతవార్త:** ఎన్నోఏళ్ళగ లెవన్‌కెవిలైనుతో భయభ్రాంతులై బిక్కుబిక్కుమంటు గడుపుతున్నారు.ఉదయగిరి ఎంఎల్ఏ కాకర్ల సురేష్ ఆదేశాలతో మీకష్టాలు తీరినట్టేనని జలదంకి మండల సొసైటి అద్యక్షుడు కరియావుల అప్పలనాయుడు అన్నారు.జలదంకి మండలం అన్నవరం ఎస్‌సి కాలనీలో ఇళ్ళ మద్యలో ప్రమాదకరంగ వున్న 11కెవి లైను ఏర్పాటు చేసివుంది.అయితే కాలనివాసులు దీనిపై బావురు మంటు ఎన్నోమార్లు సంబందిత అదికారులకు విన్నవి ంచుకున్నప్పటికి ఫలితంశూన్యం.దీంతో ఇకలాభంలేదని అక్కడిప్రజలు ఇటీవల ఎంఎల్ఏ కాకర్ల దృష్టికి ఈ సమస్యను తీసుకుపోయి పరిష్కరిం చవల సిందిగ వేడుకున్నారు.స్పందించిన కాకర్ల కరంటుఎఇ సునీల్‌కుమార్‌తో మాట్లాడి పరిశీలించి సరి చేయాలని ఆదేశిం చారు. అంతేకాకుండ దీనిని పాలప్‌చేసే భాద్యత అప్పలనాయుడికి అప్పగించాడు.దీంతో అప్పలనాయుడు ఎఇ సునీల్‌కుమార్,మండల టిడిపి సీనియర్‌నేత అన్నవరంగ్రామవాసి అయిన పూనూరు బాస్కర్‌రెడ్డిలను వెంటబెట్టుకొని సోమవారం కాలనీకి వెళ్ళి అక్కడివారితో మాట్లాడారు.11కెవి లైన్‌ను పరిశీలించారు.లైనును ఏవిదంగ మార్పుచేయాలి వంటివి చర్చించి లోకేష్‌ను చూశారు.అతిత్వరలో దీనిని పరిష్కారంచేస్తామని కాలనివాసులకు తెలిపారు.దీంతో దీర్గకాలికంగ వున్న సమస్యతీరే సమయం దగ్గరపడిం దని వారందరు సంతోషం వ్యక్తంచేశారు.

## డ్రైనేజి కాలువలలో పూడికతీత పనులు పరిశీలించిన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ



**బుచ్చి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకొని పూడికతీత పనులకు సహకరించిన వ్యాపారస్తులకు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ ధన్యవాదాలు తెలిపారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల సహకారంతో బుచ్చిరెడ్డి పాళెం నగర పంచాయితీని అభివృద్ధిచేసు కుందామని చైర్‌పర్సన్ మోర్ల సు ప్రజా మురళీ పిలుపునిచ్చారు. బుచ్చిరెడ్డి పాళెం నగర పంచాయితీ పరిధిలో బాంబే రోడ్డుకి ఇరువైపులా డ్రైనేజి కాలువలలో జరుగుతున్న పూడికతీత పనులను కమీషనర్ బాలకృష్ణాతో కలిసి ఆమె పరిశీలించారు. బాంబేరోడ్డుకు ఇరువైపులా షుమారు 3.5 కిలోమీటర్లు సైడ్‌డ్రైన్లు ఆక్రమణకు గురైయ్యాయని ఆమె తెలిపారు. రానున్న వర్షాకాలంలో రోడ్లపై వర్షపు నీళ్ళు నిలిచిపోయి పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో డ్రైనేజి కాలువలో పూడికతీతపనులు చేపట్టడం జరిగిందని అన్నారు. పది లక్షలు వెచ్చించి పీర్ల కాలువ నుండి జెండా దిబ్బ రోడ్డు వరకు కాలు నుండి గల కాలువ మరియు కెంఎం హాస్పటల్ నుండి రాఘవరెడ్డి కాలనీ ప్రాంతంలో జరుగుతున్న పూడిక పనులను ఆమె పరిశీలించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

## 18 నుంచి కసుమూరు శ్రీ హజరత్ మస్తాన్ వలి గంధోత్సవం



**నెల్లూరు, సెప్టెంబరు 15, ప్రభాతవార్త-వైద్యం :** 18 నుంచి కసుమూరు శ్రీ హజరత్ మస్తాన్ వలి గంధోత్సవం విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ నెల్లూరు ఆర్‌బీ అతిథిగృహంలో ఆర్డీఓ అనూషా, డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, వక్ఫ్ బోర్డు ఇన్ స్పెక్టర్ షేక్ ఖుదావన్, ఈఓ షేక్ షరీఫ్ తో కలిసి అధికారులతో సమీక్ష మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌక్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలి దర్గా ప్రాంగణంలో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలి.పార్కింగ్ కు పక్కా ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ కు అవాంతరంగా చర్యలు తీసుకోవాలి.భక్తుల అవసరాల మేర మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. అవసరాలను బట్టి మొబైల్ టాయిలెట్ల సంఖ్యను పెంచాలితాగునీటికి ఇబ్బంది లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి భక్తుల రక్షణ కోసం ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణం కొనసాగేలా చూడాలి రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ అధికారుల సహకారంతో ప్రత్యేక బస్సులు నడపాలి

## జెడ్పీలో "మార్పు" పై 3 రోజులు శిక్షణా కార్యక్రమలు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** శిక్షణలు జిల్లా ప్రజా పరిషత్, నెల్లూరు జిల్లా జడ్పిటిసి సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు ,సర్పంచులుగా ఎన్నిక కాబడిన మహిళా ప్రజా ప్రతిని ధులకు జిల్లా స్థాయిలో స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారిత గ్రామీణాభివృద్ధి దిశగా "మార్పు" పై అవగాహన తేది 16.09.2025 నుండి తేది 18 .09.2025 వరకు 3 రోజులు శిక్షణా కార్యక్రమం, జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతున్నది, జడ్పీ సీఈవో మోహన్ రావు ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ల (డిఎల్‌ఎంటిఎస్) శిక్షణా కార్యక్రమంలో హాజరు కావాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

### ఏఎంసి చైర్మన్ బెజవాడ వంశీకష్ణను

### అభినందించిన వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ దంపతులు



**బుచ్చి సెప్టెంబర్ 15 ప్రభాతవార్త** కోవూరు ఏఎంసి చైర్మన్‌గా నియమితులైన బెజవాడ వంశీకృష్ణారెడ్డిని బుచ్చిరెడ్డిపాళెం వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ, హాస్పటల్ డైరెక్టర్ దొడ్ల కోదండరామిరెడ్డి దంపతులు అభినందించారు. వంశీకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు. వంశీకృష్ణతో వారికి వున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

## గ్రామపంచాయతీల అభివృద్ధిలో పొదుపు సంఘాల భాగస్వామ్యం: జాయింట్ కలెక్టర్ కే కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో గ్రామ సమృద్ధి, స్థైర్యం పై జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వ రూపొందించిన ఈ ప్లాన్ లక్ష్యాలను ప్రజలందరికీ చేరువ చేయాలని సూచించారు. డిఆర్డిఏ పరిధిలోని పొదుపు సంఘాలను గ్రామపంచాయతీ అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా ఆయన చెప్పారు. పీడీడీఆర్‌డీఏ నాగరాజ కుమారి మాట్లాడుతూ వీపీఆర్‌పీ అనే కార్యక్రమంపై గ్రామ స్థాయిలో వీఓఏలు పొదుపు సభ్యులకు జీవనోపాధులు, ప్రజావస్తు సేవలు, సామాజిక అభివృద్ధి మొదలైన అంశాలపై నివేదికలు తయారు చేసి అక్టోబర్ రెండవ తేదీన జరిగే గ్రామ సభలలో ప్రవేశపెట్టాలన్నారు. ఈ సందర్భంగా మిగిలిన ప్రభుత్వ విభాగాలను గ్రామ స్థాయిలో సమన్వయం చేయాలని జిల్లా అధికారులకు సూచించారు.

## పెన్నా బ్యారేజి నుండి దిగువకు నీరు విడుదల





**సంగం సెప్టెంబర్ 15 ప్రభాతవార్త** సోమశిల నుండి పెన్నా బ్యారేజికి భారీగా నీటిని విడుదల చేయడంతో సంగం బ్యారేజికి సోమశిల జలాలు చేరుతున్నాయి. సంగం బ్యారేజికి చేరిన నీటిని బ్యారేజి గేట్లు ఎత్తి ఇరిగేషన్ అధికారులు, తెలుగుదేశం నాయకులు నెల్లూరుకి నీటిని విడుదల చేశారు. బ్యారేజి వద్ద గంగమ్మకు పూజలు చేసి నీటిని విడుదల చేశారు.బ్యారేజి నుండి గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు పెన్నా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు . మత్స్యకారులు, ప్రజలు, పశువుల కాపరులు పెన్నానదిలో దిగరాదని అధికారులు సూచించారు. ఈకార్యక్రమంలో సంగం బ్యారేజి డిఇ జయరామిరెడ్డి, ఏఈలు వినయ్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, సంగం సొసైటీ అధ్యక్షులు గుండ్ల పల్లి శ్రీనివాస్‌యాదవ్ , అన్నారెడ్డిపాళెం నీటి సంఘం అధ్యక్షులు సూరా శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ రాజేష్, రెవిన్యూ ఇనస్పెక్టర్ సల్మా పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణ పర్యవేక్షణలో కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 15,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా సోమవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు, పంప్ స్టేషన్, డాగ్ షెడ్ తదితర ప్రాంగణాలలో పర్యటించి వాటి నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రాంగణంలోని నిరుపయోగంగా ఉన్న వాహనాలను పరిశీలించారు. ప్రాంగణంలోని వివిధ విభాగాలకు సంబంధించి అధికారులకు సూచనలు జారీ చేశారు. అనంతరం స్థానిక జయలలిత నగర్ ప్రాంతంలోని పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ తీరును కమిషనర్ తనిఖీ చేసి ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేషన్ కు కొత్త ట్రాక్టర్ వాహనాలు



**నెల్లూరు కార్పొరేషన్,సెప్టెంబర్ 15,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని వెహికల్ షెడ్ ను సోమవారం తనిఖీ చేశారు. షెడ్డులో జరుగుతున్న వాహనాల మరమ్మతు పనులను పర్యవేక్షించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు నూతనంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్ వాహనాన్ని కమిషనర్ పరిశీలించి, వాహనం సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. వాహన పనితీరును తెలుసుకునేందుకు షెడ్డు ప్రాంగణంలో కమిషనర్ నూతన ట్రాక్టర్ ను స్వయంగా నడిపి పరిశీలించారు.

## భారతదేశ గర్వించదగ్గ తొలితరం ఇంజనీర్ నిపుణుడు విశ్వేశ్వరయ్య: నుడా చైర్మన్ కోటంరెడ్డి

### నుడా ఆఫీసులో ఇంజనీర్లకు ఘనంగా సన్మానం



**నెల్లూరు కార్పొరేషన్,సెప్టెంబర్ 15,ప్రభాతవార్త:** జలాశయాలే దేశ భవిష్యత్తు అని నమ్మిన వ్యక్తి మోక్ష గుండం విశ్వేశ్వరయ్య అని నెల్లూరుఅర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఇప్పటి యువతరం ఇంజనీర్లకు ఆయన స్ఫూర్తి ప్రదాత అని వెల్లడించారు. మో క్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా నుడా కార్యాలయంలో ఆ యన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. నుడా కార్యాల యంలో ఉన్న ఇంజనీ ర్లను ఘనంగా సన్మానించారు. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య పూర్వీకులు ప్రకాశం జిల్లా బెస్తవారిపేట సమీపం లో ఉండే వారిని కోటంరెడ్డి అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలలో ఇంజనీర్ల పాత్ర కీలకమని ఆయన కొనియాడారు. ప్రాజెక్టులు రోడ్ల నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర విశేషంగా ఉంటుందని వెల్లడించారు. పనిచేసే అధికారులు అంటే తనకు ఎంతో అభిమానంఅని..వారి కష్టం వల్లే సంస్థకు ప్రభుత్వా నికి మంచి పేరు వస్తుందని ఆయన అన్నారు. నుడాలో నిధులు లేకపోవడంతో మంచి ఇంజనీర్లను పెట్టుకుని కూడా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చెయ్యలేకపోతున్నానని అయన అన్నారు. తొలిసారి నుడా చైర్మన్ గా బాధ్యతలు చేపట్టినప్పుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఇంజినీర్లతో కలిసి పని చేస్తే కొత్త కొత్త ఆలోచనలు వస్తాయన్నారు. నుడాలో మంచి ఇంజనీర్లు ఉన్నారని.. అందరం కలిసి మరింత అభివృద్ధి చేద్దామని అయన తెలిపారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో ఇంజనీర్లు మరింత కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు చంద్రయ్య ,బాలకోటయ్య , సెక్రటరీ అల్లంపాటి పెంచలరెడ్డి , మాధురి,నితీష్, పాల్గొన్నారు.



## బాజాపా సేవా పక్షత్సవాల సమావేశం



**చేజర్ల సెప్టెంబర్ 15 ప్రభాతవార్త** చేజర్ల మండలం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో సోమవారం సేవా పక్షోత్సవాలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 17 వ తేది నుండి అక్టోబర్ రెండో వ తేది వరకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో తెలియజేశారు. అక్టోబర్ 2 వ తేది గాంధీ జయంతి వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర భాజప పార్టీ సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో చేజర్ల మండల అధ్యక్షులు గుండాల విజయబాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిధులుగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ మాల్యాద్రి, బిజెపి జిల్లా ఉపాధ్యాక్షులు బత్తల కిష్టయ్య, మండలం ఇంచార్జి సిహెచ్ భారత్‌రెడ్డి,భారతీయ జనతాపార్టీనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీలో ఉంటూ పార్టీ ప్రతిష్టని దిగజార్చే పనులు చేస్తే ఊరుకోము

### - జనసేనాని పవన్ దృష్టికి ముష్కరుల జాబితా



**నెల్లూరు, సెప్టెంబరు 15, ప్రభాతవార్త-విద్య :** పార్టీలో ఉంటూ పార్టీ ప్రతిష్టని దిగజార్చే పనులు చూస్తే ఊరుకోబోమని జనసేన పార్టీ సీనియర్ నాయకులు హెచ్చరించారు. పార్టీ ప్రతిష్టని మంటగలిపే చర్యలు చేస్తున్న వారిజాబితాని పార్టీ అదినేత పవన్ దృష్టికి తీస్కెళ్లనున్నామని హెచ్చరించారు. సోమవారం నగరంలోని స్థానిక గోమతి నగర్ జనసేనపార్టీ జిల్లా ప్రదాన కార్యలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లడుతూ పార్టీ వృద్ధి చెందాలంటే పాత, కొత్త నాయకులు ఇద్దరూ అవసరమన్నారు. పార్టీ ప్రారంభం నుండి ఉన్నవారికి గౌరవం ఇవ్వాలని, అదే విధంగా పార్టీలో కొత్తగా చేరినవారు పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని, వారికి ఎలాంటి అడ్డంకులు లేకుండా పనిచేయడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ ప్రారంభం నుండి ఉన్నవారితో సహా, జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి ఎలాంటి అంచనాలు లేకుండా అందరితో కలిసి పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థలు, కార్పొరేషన్ ఎన్నికలపై దృష్టి సారించి, పోటీ చేసే ప్రతి సీటులో విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. కార్పొరేషన్లో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించడానికి తాను సంతోషంగా సహాయపడతానని పేర్కొన్నారు. జిల్లా ప్రదాన కార్యదర్శి గునుకల కిషోర్ మాట్లడుతూ తాను మనుక్రాత్ రెడ్డి హయాంలో పార్టీ బాధ్యతలు చూశానని, అప్పటికి, ఇప్పటికి ఉన్న వ్యత్యాసాలను ఆయన పోల్చి చెప్పారు. పార్టీలో 2019 నుండి లేదా అంతకంటే ముందు నుండి ఉన్న ప్రతి ఒక్కరూ జనసేన సభ్యులే అని అన్నారు. సాధారణ కార్యకర్తలకు ముఖ్యమైన పదవులు ఇచ్చి గౌరవించామని, మహిళలు, ఎస్సీ, బీసీలకు ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఇచ్చామని పేర్కొన్నారు. నెల్లూరులో చేపట్టిన పలు కార్యక్రమాల్లో భాగంగా చలివేంద్రాలు, క్యాన్సర్ రోగులకు ఆహారం, సైకిళ్ల పంపిణీ, గిరిజన కుటుంబాలకు సహాయం, జన సైనికులకు సహాయం, పిఠాపురం ఫౌండేషన్ దేకు పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించడం వంటి కార్యక్రమాలని పెద్దసంఖ్యలో చేపట్టామన్నారు. కుట్ర రాజకీయాలని తాము ఉపేక్షించబోమని, కూటమి విజయం తర్వాత నెల్లూరులో జరిగిన విజయోత్సవ ర్యాలీకి ఈ బ్యాచ్ రాలేదని, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వీరు క్రియాశీలంగా పాల్గొనలేదని విమర్శించారు. నెల్లూరులో జరిగిన జనవాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. నెల్లూరు జిల్లా నుండి పార్టీకి 25 లక్షల విరాళం ఇవ్వడం జరిగిందన్నారు. టీవీ ఛానెళ్లు, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం ఆపాలని డిమాండ్ చేశారు. సింగంసెట్టి శ్రీరామ్ మాట్లడుతూ 2021, 2022, 2023 సంవత్సరాలలో మనోక్రాంత్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సభ్యత్వాలు చాలా తక్కువగా ఉన్నాయని 2024లో పార్టీ సభ్యత్వ నమోదులో అనూహ్యమైన వృద్ధి కనిపించిందని తెలిపారు. నెల్లూరు రూరల్ నాయకులు పావుజెన్ని చంద్ర శేఖర్ రెడ్డి మాట్లడుతూ సమాజంలో సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు, అసత్య సమాచారం వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కార్యాలయ ఇంచార్జి జమీర్ తదితరులు పాల్గొన్నారు.

## మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళులు



**కోవూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** కోవూరులోని నేతాజీనగర్‌లో ఉన్న ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయంలో సోమవారం భారతరత్న ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య 58వ జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి ట్రాన్స్‌కో ఈఈ కె. రమేష్ చౌదరి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రఖ్యాత సివిల్ ఇంజనీరింగ్ నిపుణులు, భారతరత్న బిరుదుతో పిలవబడే ప్రముఖ భారతీయ సివిల్ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య నిరాడంబర జీవిత శైలిని ప్రతి ఒక్కరూ ఆదర్శకంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డిప్యూటీ ఈఈ మధుసూదన్‌రెడ్డి, ట్రాన్స్‌కో రూరల్ ఏఈ గిరిధర్, కోవూరు ట్రాన్స్‌కో సబ్ డివిజన్‌కు సంబంధించిన ఓఅండ్‌ఎం స్టాఫ్, జూనియర్ ఇంజనీర్ వైవీ సునీల్, తదితరులు ఉన్నారు

## అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



**కోవూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** కోవూరు ఏపీఎస్‌పీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న కె. రమేష్ చౌదరి ఇటీవల పీఎం సూర్యఘర్ పథకం విజయవంతం చేయడంలో ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలో ప్రథమ స్థానం సాధించడం పట్ల ఇటీవల ఆయనకు తిరుపతిలో ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. దీంతో సోమవారం ఇంజనీర్స్‌డే సందర్భంగా ట్రాన్స్‌కో ఈఈ రమేష్ చౌదరికి కోవూరు ట్రాన్స్‌కో ఓఅండ్‌ఎం అధికారులు, సిబ్బంది శాలువా, పుష్పగుచ్ఛంతో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్‌రెడ్డి, రూరల్ ఏఈ గిరిధర్, కోవూరు టౌన్ జూనియర్ ఇంజనీర్ వైవీ సునీల్, కోవూరు టౌన్ ఎల్ఐ వి.మహేష్, ట్రాన్స్‌కో ఎల్‌ఎంలు కేఎల్‌వీ ప్రసాద్‌రావు, కె. శివకుమార్,పి.సురేష్, ఏఎల్‌ఎం సీహెచ్ శ్రీనివాసులు, శీనయ్య, సీనియర్ అసిస్టెంట్ జి. శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

## మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహావిష్కరణ



**కోవూరు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** కోవూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ప్రాంగణంలో సోమవారం ఇంజనీరింగ్ డే సందర్భంగా ప్రముఖ భారతీయ ఇంజనీరు , భారతరత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆర్‌అండ్‌బీ సూపరింటెండింగ్ ఇంజనీరు ఎం. గంగాధర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుని విగ్రహ ఏర్పాటుకు ప్రత్యేకంగా కృషి చేసిన ఆర్‌అండ్‌బీ కావలి ఈఈ ఏ. వేణుగోపాల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్. డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ చందర్. ఆర్‌అండ్‌బీ ఏఈలు చంద్రశేఖర్, నాగరాజు, సీహెచ్ భరత్ కృష్ణారెడ్డి, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఆర్‌అండ్‌బీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## చేపట్టే పనిని సేవా దృక్పథంతో చేయాలి

### మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందరికీ ఆదర్శప్రాయుడు



**కోవూరు సెప్టెంబర్ 15 ప్రభాతవార్త.** భారతరత్న అవార్డు గ్రహీత ఇంజనీరింగ్ కి పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ను నేటి ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలని ఆర్ అండ్ బి సూప రెండెంట్ ఇంజనీర్ ఎం గంగాధర తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ మహనీయుని జన్మదినాన్ని ఇంజనీర్స్ దేగజరుపుకోవడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు వరదలకు ఇబ్బందులు పడుతున్న హైదరాబాద్ ప్రజానీకానికి ఎలాం అటువంటి మహనీయుని విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో ఆనందంగా ఉందన్నారుటి ఇబ్బంద కలగకుండా ఉండేందుకు ఆలోచించి హిమాయత్ సాగర్ హుస్సేన్ సాగర్‌లను నిర్మించడం జరిగిందన్నారు అటువంటి మహనీయుని అడుగుజాడల్లో పయనించాలని పిలుపునిచ్చారు గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ 100 సంవత్సరాలకు ముందే జన్మించి రాబోయే తరాలకు ఇంజనీర్ ఒక నిబ్బదతో ఎలా ఉండాలి హార్డ్ వర్క్ ఎలా చేయాలో చేసి చూపించిన మహనీయుడు ఆయనే నన్నారు టెక్నాలజీ పెరిగిన ఆయన చేసిన పనిని ఎప్పటికీ ఎవరు రీచ్ కాలేదు అన్నారు డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ చందర్ మాట్లాడుతూ అటువంటి మహనీయుని విగ్రహావిష్కరణలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నామన్నారు ఇంకా ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి కావలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణుగోపాల్ గూడూరు ఎక్స్పీరియర్ రామాంజనేయులు డిప్యూటీ ఎస్సీ జి రామకృష్ణ ప్రసాద్ ఎన్ హెచ్ డి అనిల్ రెడ్డి క్యూ సి డి ఇ శివయ్య ఆత్మకూరు డి ఈ రంగయ్య కోవూరు సబ్ డివిజన్ ఏఈలు చంద్రశేఖర్ నాగరాజా తదితరులు ఉన్నారు

## ఇస్కాన్ వంటశాలలను తనిఖీ చేసిన కమిషనర్

### - వంటశాలలో ఆహార పదార్థాల తయారీ విధానం, నాణ్యత పై అరా



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 15,ప్రభాతవార్త:** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై ఓ నందన్ కార్పొరేషన్ పరిధిలోని 22 వ డివిజనల్ , స్నేహ నగర్ రెండవ వీధి ప్రాంతంలో కాంపాక్ట్ ద్వారా పారిశుధ్య నిర్వహణ పనులను సోమవారం పర్యవేక్షించారు. అనంతరం సమీపంలోనే ఇస్కాన్ వంటశాలలను కమిషనర్ తనిఖీ చేశారు. వంటశాలలో ఆహార పదార్థాల తయారీ విధానం, నాణ్యత, వివిధ ప్రమాణాలను పరిశీలించారు. డివిజన్ పరిధిలోని ప్రధాన డ్రైను కాలువ నిర్వహణ తీరును కమిషనర్ పరిశీలించారు. కాలువలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వేయకుండా నిరంతరం పర్యవేక్షించి, మురుగు నీటి సరఫరా సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.